క్లుప్తంగా

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పెద్దశంకరంపేట పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. బుజ్రాన్‌పల్లిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన, ఉత్తులూర్‌లో పాఠశాల ప్రహరీ, పెద్దశంకరంపేట పీహెచ్‌సీలో నూతన 108 వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించి మహిళలతో, వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, ఎంఈఓ వెంకటేశం, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వే పూర్తి



భూమిని పరిశీలిస్తున్న ఆర్ఐ ఫెరోజ్

రేగోడ్(మెదక్): మండలంలో రైతు భరోసా సమగ్ర భూ సర్వే పూర్తి అయిందని ఏఓ జావిద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తంగా 17,299 ఎకరాలను సర్వే చేయగా 16,987 ఎకరాలు వ్యవసాయ భూమిగా ఉందని, 314 ఎకరాలు వ్యవసాయేతర భూమిగా గుర్తించామని చెప్పారు. అదే విధంగా మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో సుమారు మూడు వేలకు పైగా కూలీలు ఉపాధిహామీ పనులు చేశారు. అయితే ఇరవై రోజులు పని చేసి భూమి లేని 276 మంది కూలీలను ఆత్మీయ భరోసా పథకానికి గుర్తించామని ఏపీఓ జగన్మోహన్‌సింగ్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలో నిర్వహించిన గణేశ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అల్లాదుర్గం క్రికెట్ జట్టు విజయం సాధించింది. సోమవారం ఫైనల్ మ్యాచ్‌లో జోగిపేట, అల్లాదుర్గం జట్లు తలపడ్డాయి. ఇందులో అల్లాదుర్గం జట్టు విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది. విజేతలకు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బల్‌రాం బహుమతులు అందజేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు విఠల్ ఆధ్వర్యంలో ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మండలంలో స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో ఖేడ్ నియోజకవర్గ నాయకులు రామకృష్ణ, సంజీవరెడ్డి ఉన్నారు.

రైతు భరోసాపై అవగాహన

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆర్డీఓ రమాదేవి రైతు భరోసాపై రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు, హర్టికల్చర్‌పై అవగాహన కల్పించారు. సోమవారం నిజాంపేటలో రైతు వేదికలో అధికారులు రైతు భరోసాపై గ్రామసభలో విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, ఆర్ఐ ఇమాద్, ప్రీతి, ఏఈఓలు శ్రీలత, మౌనిక పాల్గొన్నారు.

వివరాలు సమగ్రంగా పరిశీలించాలి

శివ్వంపేట(నర్సాపూర్): అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు గ్రామసభల్లో వారి వివరాలు చదివి వినిపించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల గుర్తింపు కోసం చేపట్టాల్సిన అంశాలపై సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా కొత్తగా 1748 రేషన్‌కార్డులు మంజూరు కాగా వాటికి సంబంధించి కుటుంబ సభ్యుల వివరాలు సమగ్రంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఏపీఓ అనీల్‌కుమార్ ఉన్నారు.

ఆస్పత్రిలో వసతులు ఏవి ?

- ఇబ్బందుల్లో రోగులు
- నిత్యం 100 మంది రాక
- ఇదీ పెద్దశంకరంపేట పీహెచ్‌సీ పరిస్థితి



పెద్దశంకరంపేట ప్రభుత్వాస్పత్రి

పెద్దశంకరంపేట(మెదక్): పేరుకే పెద్దశంకరంపేట ప్రభుత్వాసుపత్రి. కానీ సరైన వసతులు లేకపోవడంతో రోగులకు సక్రమంగా సేవలు అందడం లేదు. ఆస్పత్రి స్థాయి పెరగకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో సరైన వసతులు లేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవస్థలు తప్పడం లేదు. 24 గంటల కాన్పుల కేంద్రంగా ఉన్నా పీహెచ్‌సీ స్థాయి పెరగక వసతులు సమకూరడం లేదు. దీంతో నిత్యం పీహెచ్‌సీకి వచ్చే పేషెంట్లతో పాటు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

30 పడకల ఆస్పత్రిగా మారేనా..?

1989లో డిస్పెన్సరీగా ప్రారంభమైన ప్రభుత్వ ఆస్పత్రి అప్పటి నుంచి అదే భవనంలో కొనసాగుతూ వస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా, 24 గంటల కాన్పుల కేంద్రంగా మారిన అదనపు గదుల కొరత సమస్య మధ్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడికి నిత్యం రోగులు 100 మంది వరకు వస్తుంటారు. ఆస్పత్రిలో చిన్న వార్డు స్టోర్ రూం, సిబ్బంది గది, డెలివరీ రూం, స్టాఫ్ రూంలు ఉన్నాయి. ఆస్పత్రిలో ఉన్న చిన్న వార్డులో బెడ్స్ సరిపోకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రభుత్వాస్పత్రిలో నెలకు సుమారు 20 వరకు డెలవరీలు జరుగుతుంటాయి. వ్యాక్సినేషన్ సమయాల్లో, సిబ్బంది సమావేశాలకు అవస్థలు పడుతున్నారు. 15 ఏళ్లుగా పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సుమారు రూ.22 లక్షలతో లేబర్ రూం నిర్మించిన ఇందులో పూర్తి స్థాయి వసతులు లేవు

తరుచూ జాతీయ రహదారిపై ప్రమాదాలు

మండల కేంద్రం మీదుగా 161వ (సంగారెడ్డి–నాందేడ్) ప్రధాన జాతీయ రహదారి వెళ్తుంది. తరుచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం ప్రమాదాలు జరగడంతో ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో తక్షణం రోగులకు వైద్యసేవలు అందక ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ పీహెచ్‌సీ కాన్పుల కేంద్రం కూడా కావడంతో వివిధ గ్రామాల నుంచి గర్భిణులు వస్తుంటారు. దీంతో పాటు 108 వాహన సిబ్బందికి వసతి గదిని కూడా ఇక్కడే కేటాయించారు. రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి స్టాఫ్ రూం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిస్పెన్సరీ స్థాయిలో ఉన్నప్పటి ఈ భవనంలోనే ఇప్పటికీ నిర్వహణ కొనసాగుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా.. పీహెచ్‌సీకి మోక్షం కలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు సైతం ప్రభుత్వానికి 30 పడకల ఆస్పత్రిగా మర్చాలని పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండల కేంద్రానికి ప్రచారానికి వచ్చిన సమయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈ విషయాన్ని సీఎంకు విన్నవించారు. ఇప్పటికైనా ఆస్పత్రి స్థాయిని పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

తౌర్యతండా రోడ్డుకు నిధులు



తౌర్యతండా బీటీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: తౌర్యతండా బీటీరోడ్డుకు రూ.కోటి ఐదువేలు మంజూరైనట్లు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నాగులపల్లి పంచాయతీ పరిధిలోని తౌర్యతండా బీటీరోడ్డు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూసాపేట – నాగులపల్లి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తౌర్యతండా వరకు 1.5 కిలోమీటర్ దూరం వరకు బీటీ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ. కోటి ఐదు లక్షలు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో టెండర్లు పూర్తయ్యాయని, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు త్వరలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ జెడ్పీటీసీ బాబ్యానాయక్, నాగులపల్లి తాజా మాజీ సర్పంచ్ సేనాధిపతి, మాజీ ఎంపీటీసీ జీవన్ రెడ్డి, నాయకులు షేక్ హుస్సేన్, సురేందర్ రెడ్డి, శ్రీశైలం, జలీల్, నవీన్, మహేందర్, విఠల్ చంద్రు పాల్గొన్నారు.

నీటి పరిష్కారానికి కృషి

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 14వ వార్డులో బోరు డ్రిల్లింగ్ పనులకు ఆమె పూజలు చేసి ప్రారంభించారు. పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్లు సరిత, రాంచందర్, బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, షేక్ హుస్సేన్, నర్సింలు, ఆంజనేయులుగౌడ్, తదితరులున్నారు.

ప్రభుత్వ మద్దతు కోసం రథయాత్ర

చేగుంట(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం మద్దతు ప్రకటించాలని కళాకారుల రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మాసాయిపేట యాదగిరి అన్నారు. సోమవారం మండలంలోని బీకొండాపూర్ గ్రామంలో రిజర్వేషన్ పోరాట సమితి కళాకారుల రథయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, పలు గ్రామాల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయంలో క్యూలైన్లలో భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని చాముండేశ్వరి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సోమవారం రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా భారీగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. రెండో రోజు కార్యక్రమంలో భాగంగా జపములు, పారాయణములు, మహా చండీ హవనం, మహా నివేదన, హారతి నిర్వహించామన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో చాముండేశ్వరీ సేవాసమితి, శాక్త మండల్ ఆధ్వర్యంలో బాలాజీ ఆస్పత్రి సంగారెడ్డి వారి సౌజన్యంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా ఉచిత వైద్యశిబిరం ఉంటుందన్నారు.

అమ్మవారి సన్నిధిలో అదనపు ఎస్పీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులో వెలసిన చాముండేశ్వరి అమ్మవారిని సోమవారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అదనపు ఎస్పీకి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చిలప్‌చెడ్ ఎస్ఐ నర్సింలు ఉన్నారు.

నిధులు కేటాయింపులో వివక్ష

మున్సిపల్ సమావేశంలో అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు

నర్సాపూర్: నిధులు కేటాయింపులో వివక్ష చూపినందుకు మున్సిపల్ అధికారులను పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు కౌన్సిలర్లు మురళీయాదవ్, లత, యాదగిరి, బుచ్చేష్‌యాదవ్, రాజేందర్ మాట్లాడుతూ.. నిధులు కేటాయించడంలో తమ వార్డులపై ఎందుకు వివక్ష చూపారని అధికారులను ప్రశ్నించారు. గతంలో జరిగిన సమావేశంలో అన్ని వార్డులకు సమంగా నిధులు కేటాయించాలని నిర్ణయించినా.. తాజాగా నిధులు కేటాయించడంలో ఎందుకు వివక్ష చూపారని మురళీయాదవ్ తదితరులు ప్రశ్నించారు. మున్సిపాలిటీలో ఏకపక్షంగా పనులు చేపట్టడాన్ని ఆయన తప్పు పడుతూ.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఆయన చెప్పారు. కాగా రెండు నెలలుగా మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బందికి ఎందుకు జీతాలు ఇవ్వలేదన్నారు. నిధులు కేటాయించడంలో అధికారులు వివక్ష చూపి ఏకపక్షంగా వ్యవహరించినందుకు నిరసనగా తాము సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని మురళీయాదవ్, లత, యాదగిరిలు ప్రకటించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ మాట్లాడుతూ.. తమ వార్డులో నాల్గు నెలలుగా పైపులైన్ మరమ్మతులు చేయాలని చెప్తున్నా.. మరమ్మతు చేయడం లేదని ఆరోపిస్తూ ఎజెండా తయారు చేసే సమయంలో తనకు సమాచారం ఇస్తే తన వార్డులోని సమస్యలు చెప్పే వాడినని, ఇష్టారీతిన ఎజెండా తయారు చేశారని ఆరోపించగా కమిషనర్ రామకృష్ణరావు స్పందిస్తూ పైపులైన్‌కు త్వరలోనే మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్ మాట్లాడుతూ.. తమ వార్డుల్లో పలు మరమ్మతులు చేయాలని చెప్పి నెలలు గడుస్తున్నా.. పనులు చేయడం లేదని అన్నారు. వేసవి సీజన్‌లో అన్ని వార్డుల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందని, కొన్ని వార్డులకే బోర్లు ఎలా మంజూరు చేశారన్నారు. చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎక్కడా వివక్ష చూపలేదని, అన్ని వార్డులకు నిధులు కేటాయించామని సభ్యులకు వివరించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాధనం వృథా చేయ్యొద్దని, అవకాశం ఉన్నంత వరకు బోర్లు, పైపు లైన్లు, మరమ్మతులు చేసి నీటి సరఫరాను మెరుగు పర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అందరు కలిసి మెలిసి పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని చెప్పారు. పట్టణంలో స్టేడియం నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు పూర్తి చేయించాలని కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేష్‌లు కోరగా, వాటిని పూర్తి చేయిస్తానని తెలిపారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు సరిత, లక్ష్మి, సునీత, సిద్దీఖ, లలిత, రుక్కమ్మ, రాంచందర్ పాల్గొన్నారు.

మందులు లేక రోగుల అవస్థలు



కౌంటరు వద్ద మందులు తీసుకుంటున్న రోగులు

నర్సాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కొన్ని రకాల మందులు ఇవ్వడం లేదని పలువురు రోగులు ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ.. వైద్యులు రాసిన మందులన్నింటిని ఇవ్వడం లేదని వాపోయారు. వైద్యులు నాలుగు రకాల మందులు రాస్తే, కొన్ని మందులు ఇచ్చి మిగిలిన మందులు బయట కొనుక్కోవాలని సిబ్బంది సూచిస్తున్నారని తెలిపారు. కాగా నొప్పుల నివారణకు అవసరమయ్యే ఆయింట్‌మెంటును తనకు డాక్టర్ రాయగా, లేదని సిబ్బంది చెప్పారని ఓ రోగి ఆందోళన వ్యక్తం చేశారు. పలు రకాల ఆయింట్‌మెంట్లు అందుబాటులో లేవని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయమై ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావనిని వివరణ కోరగా.. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా ఆస్పత్రిలో మందులు లేవని పుకార్లు పుట్టించారని ఆమె అన్నారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

విద్యార్థులకు టై, బెల్ట్ వితరణ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ లత సోమవారం టై, బెల్ట్ వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ యాదగిరి, కుకునూర్ కాంప్లెక్స్ హెచ్ఎం సీతారాంలు హాజరై విద్యార్థులకు టై, బెల్ట్‌లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామాయంపేట(మెదక్): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సోమవారం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారి ఆందోళనకు బీజేపీ కార్యకర్తలు తమ మద్దతు ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామని బీజేపీ నాయకులు శంకర్‌గౌడ్, భానుచందర్ హెచ్చరించారు. ప్రతీ నెల వారికి వేతనాలు, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయులపై దాడులు అరికట్టాలి



నర్సాపూర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



నర్సాపూర్ రూరల్: బ్రాహ్మణపల్లి పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్: హెడ్మాష్టరుపై దాడిని ఖండిస్తూ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెడ్మాష్టరు రాంలుపై దాడిని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి, నిరసన వ్యక్తం చేసి ఖండించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, హెచ్‌ఎం శ్రీశైలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాపన్నపేట ఉన్నత పాఠశాలలో..

పాపన్నపేట(మెదక్): ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలని పాపన్నపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, పలు సంఘాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లి, మాసాయిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో టీటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఏడాది గడుస్తున్నా నెరవేర్చని హామీలు
- మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్



అల్లాదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవెర్చడంలో విఫలమయ్యిందని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం లేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. సోమవారం అల్లాదుర్గంలో రైతుకు వెన్నుపోటు కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యకర్తలు, రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా పథకం కింద రైతుకు ఏడాదికి రూ. 15 వేలు అందిస్తామని, మహిళలకు నెలకు రూ.2500 అందజేస్తామని ఇచ్చిన హామీలు ఎక్కడ అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ పథకం సహితం అస్తవ్యస్తంగా అమలు చేసినట్లు మండిపడ్డారు. రూ.రెండు లక్షల రుణమాఫీ కాక రైతులు ఇబ్బందుల పాలయ్యరని తెలిపారు. పథకాల అమలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందన్నారు. ఆరు సంక్షేమ పథకాలు ఎవరికీ అందడం లేదన్నారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి, వీరప్ప, వీరారెడ్డి, దుర్గారెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పరామర్శ

నిజాంపేట(మెదక్): మండలంలో వేర్వేరు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మృతి చెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వెల్దుర్తి(తూప్రాన్): సంగారెడ్డిలో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగవ మహాసభల వాల్ పోస్టర్‌ను మండల కేంద్రం వెల్దుర్తిలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గౌరీ మాట్లాడారు.

◆ అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మనోహరాబాద్(తూప్రాన్): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజం కాదని ఎమ్మార్పీఎస్ మాదిగ మహిళా సమైఖ్య మెదక్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు మాధవి అన్నారు. సోమవారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఎంఆర్‌పీఎస్ మహిళావిభాగం తరఫున ఆమె అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఎస్ఐ సుభాష్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.

◆ పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): పశువుల ఆరోగ్యంపై రైతులు జాగ్రత్తగా ఉండాలని శివ్వంపేట పశువైద్యాధికారి సంధ్యారాణి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో సోమవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది పవన్, కుమార్, లక్ష్మణ్, గోపాల్, ప్రకాష్ ఉన్నారు.

◆ నేటి నుంచి గ్రామ సభలు

రేగోడ్(మెదక్): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతారావమ్మ సోమ వారం తెలిపారు.

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ పథకాల లబ్ధిదారుల గుర్తింపు కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దామోదర్ అన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 21, 22, 23 తేదీల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో మంగళవారం నుంచి గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కొల్చారం(నర్సాపూర్): సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు మండలంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ అన్నారు.

◆ స్టాపర్లు ఏర్పాటుపై హర్షం

నర్సాపూర్: పట్టణంలో స్టాపర్లు ఏర్పాటు చేయడంపై జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి సుధీర్‌గౌడ్ పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ రహదారిపై ఎన్జీఓస్ కాలనీ చౌరస్తా వద్ద సోమవారం పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారని చెప్పారు. తాను ఇటీవల సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగంలను కలిసి ప్రమాదాల నివారణకు జాతీయ రహదారిపై స్టాపర్లు ఏర్పాటు చేయాలని కోరానన్నారు. అందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవడం హర్షనీయమని సుధీర్‌గౌడ్ అన్నారు.